క్లుప్తంగా

పశువైద్య సిబ్బందిని నియమించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కనగానపల్లి: మండలంలో పశువైద్యాధికారులను నియమించాలని రైతు సంఘం మండల నాయకులు అధికారులను కోరారు. దీనిపై సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పాడి రైతులతో కలిసి రైతు సంఘం నాయకులు గోవిందు, బాలరాజు తహసీల్దార్ పీవీ రమణకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో రెగ్యులర్ పశు వైద్యాధికారిని నియమించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగరాజు, వెంకటేసులు, మహానంది, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని వీరచెన్నయ్యగారిపల్లిలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం

తలుపుల: పెద్దన్నవారిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న నాగలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే సిద్దారెడ్డి రూ. లక్ష విరాళంగా అందజేశారు. కదిరిలోని తన నివాసంలో ఆలయ నిర్మాణ కమిటీకి మొత్తాన్ని అందించారు. కమిటీ సభ్యులు వెంకటనారాయణ, రామాంజనేయులు, శ్రీరాములు, రాజేశ్వరయ్య, క్రిష్ణయ్య, షేక్‌బాషు, వెంకటయ్య ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

నల్లచెరువు: యర్రగుంట పల్లిలో ఇటీవల యువగళం పాదయాత్ర సందర్భంగా టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాగభూషణ, కార్యకర్తలు రెడ్డెప్ప, లక్ష్మీపతి, సురేష్, మనోహర్, వెంకటరమణను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి పరామర్శించారు. దాడికి పాల్పడిన పారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, సింగిల్ విండో డైరెక్టర్ ఆదిమూర్తి, బావాఖాన్, మణి, చిన్నపల్లి హరి నరేంద్ర, వేమ హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30న శ్రీరామనవమి వేడుకలు

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి గ్రామంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 30న శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. సోమవారం ఆలయంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శనివారం వనభోజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కొమండూరు మారుతి ప్రసాద్, రమేష్, సాయి కృష్ణ తదితరులున్నారు.

రేపు వారపు సంత వేలం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం పెడపల్లి వారపు సంత వేలంపాటను 29వ తేదీ బుధవారం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి తేజశ్రీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచ్ మంగ్లీబాయి, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి సమక్షంలో ఉదయం 11 గంటలకు గ్రామ సచివాలయంలో వేలంపాట ఉంటుందని, ధరావత్తు రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

'ఎన్‌ఎస్‌యూఐ' నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

ధర్మవరం: అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఎన్ఎస్‌యూఐ నాయకులు నిరసన చేపట్టారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, పట్టణ అధ్యక్షుడు చైతన్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. గుజరాతీ మోడీలు దేశంపై పడి ఒకవైపు సంపదని కొల్లగొడుతున్నారని, మరోవైపు హిందుత్వం పేరుతో ఉన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర, నాయకులు గణేష్, గిరి, ఇంద్ర, ఆదర్శ, లచ్చి, హరి, సాయి తదితరులున్నారు.

అక్కచెల్లెమ్మలు ఆనందంగా ఉండాలి



మహిళా సంఘాల సభ్యులకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి



హాజరైన లబ్ధిదారులు

- మహిళల ఖాతాల్లో రూ.5.91 కోట్లు జమ చేశాం
- ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి
- ఘనంగా 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు

కదిరి టౌన్: అక్కచెల్లెమ్మలు ఆనందంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి అన్నారు. కదిరి మున్సిపాలిటీ పరిధిలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం స్వయం సహాయక సంఘాల సభ్యులు 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కాచెల్లెమ్మల కోసం వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. మూడో విడతగా కదిరి మున్సిపాలిటీలో మొత్తం 953 స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాల్లో రూ.5.91 కోట్లు జమ చేశారన్నారు. కరోనాతో రెండు సంవత్సరాలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అల్లకల్లోలంగా మారిందన్నారు. విపత్కర పరిస్థితులు తలెత్తినా ఇచ్చిన మాట ప్రకారం మహిళల కోసం ఏటా క్రమం తప్పకుండా నగదు జమ చేస్తున్నట్లు వివరించారు. సీఎం జగన్ మహిళలను ఎంతో గౌరవంగా చూస్తారన్నారు. అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. 2024 ఎన్నికల్లోనూ జగనన్నకు మహిళలు అండగా ఉండాలని కోరారు. ప్రజలందరూ తమ అభిమానాన్ని జగనన్నపై చూపాలని కోరారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వాల్మీకి పాఠశాల అధినేత అనిల్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాధిక్, కౌన్సిలర్లు, టీఎంసీ శ్రీనివాసరెడ్డి, సీఓలు గిరి, తౌసిఫ్, మాధవీలత, కోఆప్షన్ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, టీఎల్ఎఫ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గాండ్లపెంటలో..

గాండ్లపెంట: మండలంలోని డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సిద్దారెడ్డి పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వరమే పరిష్కరించడం కోసం ఇంటి వద్దకే వచ్చానని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 38వ వార్డులో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో డ్రైనేజీ కాలువలను సరిగ్గా శుభ్రం చేయలేదని పలువురు ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎప్పటికప్పుడు కాలువలు, రహదారులు శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు ఎమ్మెల్యే ఆదేశించారు. తమకు ఇంటిపట్టా వచ్చినా బిల్లులు పడలేదని పలువురు జగనన్న కాలనీల లబ్ధిదారులు ఎమ్మెల్యేకు విన్నవించగా, వెంటనే హౌసింగ్ ఏఈతో మాట్లాడి బిల్లులు త్వరితగతిన పడేలా చూడాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు మార్చాలని, పలు ఇళ్లపై విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని, వాటిని మార్చాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. సమస్యను పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులకు ఆయన సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఏ చిన్న సమస్య కూడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు వారి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాల్లో' భాగంగా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, వైస్ చైర్మన్‌లు భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, వార్డు కౌన్సిలర్ షంషాద్‌బేగం, వార్డు ఇన్‌చార్జ్‌లు చాంద్‌బాషా, రమణారెడ్డి, సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్కదేవతల ఉరుసు

ఓడీ చెరువు: డబురువారిపల్లి పంచాయతీ పరిధిలోని మల్లోల్లపల్లిలో సోమవారం అక్కదేవతల ఎలవగంప ఉరుసును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏడుగురు అక్కదేవత విగ్రహాలకు పసుపు కుంకుమ, నల్లగాజులు, పండ్లు, పూలు, కాయలు సమర్పించి ప్రత్యేక అలంకరణ చేశారు. పేసాని రాజారెడ్డి ఇంటి నుంచి అక్కదేవతల ఎలవ గంపను తీసుకుని ఆలయం వద్దకు కొమ్ము, డ్రమ్ము వాయిద్యాలతో తరలివెళ్లారు. అక్కదేవతలకు పచ్చ చేయించి ప్రత్యేక పూజలు చేశారు. ఏడు కలశాలు, ఏడు వెదురు చేటలు, ఏడు జాకెట్లు, ఏడు పచ్చలతో సప్తబంధన చేశారు. అక్కదేవతల ప్రతిమలకు ప్రతిరూపంగా ఏడు మంది బాలికలను పసుపు, కుంకుమతో జలాభిషేకం చేశారు. ప్రతిరూపాలైన బాలికల చేతుల్లో వెదురు చాటల్లో పసుపు, కుంకుమ, గాజులు, పచ్చకు సంబంధించిన వస్తువులను వుంచి కొలువుదీర్చారు. అక్కదేవత విగ్రహాలను రంగుంగులతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొమ్ము, డ్రమ్ము వాయిద్యాలతో అక్కదేవతల పాటలతో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి నాట్యమాడారు. వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు అక్కదేవతలకు కాయ,కర్పూరం, పూజా సామగ్రి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు.



మల్లోల్లపల్లి అక్కదేవతల ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అక్కదేవతల ప్రతిమలు

'స్పందన' అర్జీలకు పరిష్కారం చూపండి

బత్తలపల్లి: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే 'స్పందన'లో ప్రజల నుంచి అందే అర్జీలకు పరిష్కారం చూపాలని తహసీల్దార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 8 అర్జీలు అందినట్లు తెలిపారు. భూ సమస్యలపై రెండు, రస్తా సమస్యలపై రెండు, సర్వే కోసం రెండు, భూములకు పరిహారం పెంచాలని కోరుతూ రెండు అర్జీలు అందినట్లు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి ప్రతి అధికారి తప్పక హాజరు కావాలన్నారు. గ్రామ స్థాయిలో సచివాలయ ఉద్యోగులు అందరూ హాజరు కావాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సాయిమనోహర్, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఏపీఓ ఆదెప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, పశు వైద్యాధికారి గుర్నాథరెడ్డి, ఏఓ ఓబిరెడ్డిలతో పాటు ఇతర అధికారులు హాజరయ్యారు.

లక్షాధికారులను చేయడమే లక్ష్యం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, నాయకులు

పుట్టపర్తి టౌన్: మహిళలను లక్షాధికారులను చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి పేర్కొన్నారు. 'వైఎస్సార్ ఆసరా వారోత్సవాల'లో భాగంగా సోమవారం పుట్టపర్తి పట్టణంలో ఒకటో సచివాలయం పరిధిలోని సాయినగర్, పెద్దబజార్ ఏరియా స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కును పంపిణీ చేశారు. అనంతరం మహిళలు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పథకంలో మహిళలను ప్రభుత్వం భాగస్వాములను చేస్తూ అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో 482 పొదుపు సంఘాలకు మూడో విడత వైఎస్సార్ ఆసరాలో రూ. 3.73 కోట్లు విడుదల చేశారన్నారు. మెప్మా సీఎంఎం రమాదేవి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ తిప్పన్న, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, ఫోటోసాయి, నాయకులు బిల్డర్ మల్లిఖార్జున, రామయ్య, శ్రీనివాసులు, ఆటోరాజా, నరశింహమూర్తి, పైపల్లినరసింహులు, ఎస్టీడీ నరసింహులు తదితరులున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

పుట్టపర్తి అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తున్న కొంత మంది ఉద్యోగులు 2007లో మృతి చెందినా ఇప్పటి వరకూ కారుణ్య నియామకాలు పూర్తి చేయలేదని, వెంటనే నియామకాలు పూర్తి చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఏపీజేఏసీ అమరావతి శ్రీసత్యసాయి జిల్లా శాఖ కోరింది. సోమవారం కలెక్టరేట్‌లో ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ మైనుద్దీన్, జనరల్ సెక్రటరీ జీవైపీ రావులు కారుణ్య నియామకాలు పొందని ఉద్యోగుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందులో కదిరి డిపోలో పని చేస్తూ మృతి చెందిన గంగప్ప (2007), లక్ష్మీనారాయణ (2007), నరసింహులు (2017), హిందూపురం డిపోలో శంకరయ్య, గోపాల్, రాజేంద్ర కుటుంబాలను పరామర్శించారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగంపై ఆధారపడి జీవిస్తున్న చాలా కుటుంబాలు యజమాని మృతి చెందడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. వెంటనే కారుణ్య నియామకాలు పూర్తి చేసి ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. త్వరలో జరగనున్న అమరావతి ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు పరామర్శ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ నాయకులు పాల్గొన్నారు.

'లోకేష్ నోరు అదుపులో పెట్టుకో'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓడీ చెరువు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. సోమవారం మండల కేంద్రంలో జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాష, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్‌చౌదరి మాట్లాడారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి స్క్రిప్ట్ రాసిస్తే చదివిన లోకేష్‌కు ఏమాత్రం తెలివుందో ప్రజలకు అర్థమైపోయిందన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో వేల కోట్లు దోచుకున్న ఘన చరిత్ర తెలుగుదేశం పార్టీదే అన్నారు. నీరు చెట్టు కింద నియోజకవర్గంలో వేల కోట్లు దోచుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేశారని, పుట్టపర్తి కేంద్రంగా శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పాటు, జాతీయ రహదారులు, గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారి, అన్ని గ్రామాలకు తారురోడ్లతో పాటు సీసీ రోడ్లు, 25 వేల గృహాల మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండడమే కాకుండా గడప గడపకూ వెళ్లి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారన్నారు. పల్లె రఘునాథరెడ్డి మాత్రం అనంతపురంలో ఉంటూ చావులు, ప్రమాదాలు జరిగినప్పుడు చూసిపోతున్నారని దుయ్యబట్టారు. లోకేష్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకుంటే ప్రజలు క్షమించరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎద్దుల వెంకటరంగారెడ్డి, సహకార సంఘ అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి, సర్పంచులు గోవిందు, తొట్లిరంగారెడ్డి,రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచు సూర్యనారాయణరెడ్డి, నాయకులు భారతి సిమెంట్ రఫిక్, మజీద్, జానీ, గొల్లపల్లి వెంకటరెడ్డి, రామాంజినేయులు, రమణ,సురేష్, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ధర్మవరం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 29వతేదీన కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే కౌన్సిల్ సమావేశానికి కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు హాజరుకావాలన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీ బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

స్కాలర్‌షిప్ సద్వినియోగం చేసుకోండి

ప్రశాంతి నిలయం: ఎంబీఏ కోర్సు చేయాలనుకునే విద్యార్థులకు కోసం సంస్కృతీ విద్యాసంస్థలు సాయిప్రూడెంట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల డీన్ డాక్టర్ బాలకోటేశ్వరి తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం సంస్కృతీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆవరణలో సాయిప్రూడెంట్ పోస్టర్లను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 2న పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ పూర్తి చేసిన, ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. సాధించే మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. వివరాలు 9100974544 ద్వారా తెలుసుకోవచ్చునన్నారు.

గొట్లూరులో సర్వే

ధర్మవరం అర్బన్: ఉపాధిలేని యువతపై సర్వే చేస్తున్నామని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గొట్లూరులో సోమవారం ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్ పర్యవేక్షణలో సర్వే చేశారు. 15 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాల మధ్య యువతపై సర్వే చేశామన్నారు. అధ్యాపకులు షమీవుల్లా, ఆనంద్, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ముదిగుబ్బలోని 10వ వార్డులో స్థానిక నాయకులతో కలిసి ఆయన గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతు సంక్షేమ పథకాల లబ్ధిని ఆరా తీశారు. వార్డులోని సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, నాయకులు భాస్కర్, చంద్రాయుడు, కిరణ్‌మోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కుల్లాయప్ప, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ పూజ

తనకల్లు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలను చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లియాఖత్ అలి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవడం ద్వారా పరీక్షలలో మంచి ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులందరూ ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్‌రెడ్డి, గౌస్, ముబారక్, శ్రీవాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టాలి

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రానికి వరప్రసాదిని అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య పేర్కొన్నారు. పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద రెండు రోజుల రిలే నిరాహార దీక్షలను సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తగినన్ని నిధులను విడుదల చేసి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు ఎత్తును ఇంచి కూడా తగ్గించకూడదన్నారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గితే రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. నిర్వాసితులకు రూ.30 కోట్ల పరిహారం ఇవ్వాలని, పునరావాసం కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అంజి, బయన్న, కదిరెప్ప, కుల్లాయప్ప, జయలక్ష్మి, నాయకులు వెంకటనారాయణ, బాష, రమణ, ఈశ్వరయ్య జ్యోతి, లీలావతి తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలందించండి

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ ఈటెరాము, ఎంపీడీఓ ఆదినారాయణ వైద్యసిబ్బందికి సూచించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.1.50 లక్షల నిధులు మంజూరు చేయగా, ఇప్పటి వరకు చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఇందులో అక్టోబర్ 2022 వరకు రూ.1.09 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని, 2023 మార్చి వరకు రూ.40 వేలతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టినట్లు వైద్య సిబ్బంది వివరించారు. రికార్డులను ఎంపీపీ, ఎంపీడీఓ పరిశీలించారు. మండలంలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ ఆసియా, కోఆప్షన్ సభ్యులు సుబహాన్, నాయకులు గోవిందునాయక్, నారాయణస్వామి, రామక్రిష్ణ, వాటర్‌షెడ్ చైర్మన్ బయారెడ్డి, ఎంపీహెచ్ఈఓ లక్ష్మీనారాయణ, ఫార్మసిస్ట్ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా కార్పెంటర్స్ డే

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో చిత్రావతి బ్రిడ్జి వద్ద కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కార్పెంటర్స్ డే ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం కర్నాటక నాగేపల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు, ఎనుములపల్లి ప్రాథమిక ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పాలు, పండ్లు పంపిణీ చేశారు. చిత్రావతి పరివాహపు ప్రాంతాల్లో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కార్పెంటర్స్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

ముదిగుబ్బ: కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 40 సీట్లు ఉన్నాయన్నారు.

వాహనం వితరణ

కొత్తచెరువు: అనంతపురం కేంద్రంగా పనిచేస్తున్న విఎ సంస్థకు ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారు మహీంద్రా సూపర్ వ్యాన్‌ను వితరణగా అందించారు. సోమవారం అమ్మవారి పల్లి కేంద్రంగా పనిచేస్తున్న హ్యుండాయ్ మెటీరియల్స్ ఇండియా లిమిటెడ్ సహకారంతో కంపెనీ జనరల్ మేనేజర్ చేతుల మీదుగా అందజేసినట్లు పీఆర్‌డీఎస్ ప్రతినిధి ప్రభాకర్ తెలిపారు.

వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు

ముదిగుబ్బ: దొరిగిల్లు గ్రామంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 74 మంది వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 36 మందికి కంటి అద్దాలు, 12 మందికి కంటి ఆపరేషన్లు, 26 మందికి చుక్కల మందును ఇచ్చినట్లు ఆప్తాల్మిక్ అధికారి జయరాములు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ భారతి తదితరులు పాల్గొన్నారు.

పంటరుణాలు రెన్యూవల్ చేసుకోండి

నల్లమాడ: నల్లమాడ వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ)లో పంట రుణాలు కలిగిన రైతులు ఈనెల 30లోగా రెన్యూవల్ చేసుకోవాలని సహకార సంఘం అధ్యక్షులు ఏ.గంగిరెడ్డి, సీఈఓ కేశప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫోన్ నెంబర్ లింక్ అయిన ఆధార్, ఒన్‌బీ, రెండు పాస్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ

తనకల్లు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మారప్పగారిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారులకు, కిశోర బాలింతలు, గర్భిణులు, బాలింతలకు మంచి పోషక విలువలతో కూడిన సంతులిత ఆహారాన్ని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం అందజేసిన పౌష్టికాహారాన్ని సకాలంలో అర్హులకు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ తరానా, ఏఎన్ఎం సాఫియా, పలు కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.